
# ఇసి అధికారాలు అపరిమితమా?

కె. బాలగోపాల్

ఎన్నికల సక్రమ నిర్వహణ కోసమని చెప్పి ఎన్నికల అధికారులు జారీచేస్తున్న ఆదేశాలకు సమాజంలో అందరూ కిమ్మనకుండా తల ఒగ్గడం కొంచెం ఆశ్చర్యం కలిగిస్తున్నది. నీకేం అధికారం ఉంది అని ఎవ్వరూ దానిని అడగడం లేదు. రాష్ట్ర డిజిపిని మార్చి ఫలానా అధికారినే నియమించమన్నా, కలెక్టర్ల లిస్టిచ్చి వీళ్లందరినీ బదిలీ చేసేయమన్నా, గోడల మీద రాయొద్దన్నా, బ్యానర్లు కట్టొద్దన్నా, ఇచ్చిన ఉపన్యాసం ఇంక చాలు స్టేజి దిగిపొమ్మన్నా మనసులో గొణుక్కుంటున్నారేమోగానీ అమలు చేసేస్తున్నారు. 'ఇసి'తో గొడవ పెట్టుకుంటే అనర్హత ప్రకటిస్తుందేమో నన్న భయం అభ్యర్థులలో ఉన్నట్టయితే వాళ్లకు ఏ చట్టమూ తెలియనట్టే ఎన్నికల చట్టాలూ తెలియవని అనుకోవాలి. అంతటి అధికారం 'ఇసి' కేం లేదు.

అభ్యర్థుల సంగతి పోనీయండి. ఎన్నికల అధికారులు ఒక నెల, నెలన్నర రోజుల పాటు చలాయించే ఈ ఎదురులేని అధికారానికి సమాజంలో చాలా ఆదరణ ఉందన్న విషయం ఆశ్చర్యం కంటే ఎక్కువ ఆందోళన కలిగిస్తుంది. అక్రమాలను ఒక్కవేటుతో అరికట్టే బలవంతుడొకడు రావాలన్న అత్యంత అప్రజాస్వామిక ఆకాంక్ష మన మనస్సులలో ప్రగాఢంగా ఉన్నట్టుంది. సినిమా వాళ్లు దీనిని బాగా వాడుకున్నారు. నిజ జీవితంలో జడ్జీలు అప్పుడప్పుడు ఈ పాత్ర పోషిస్తుంటారు. అయితే జడ్జీలిచ్చే తీర్పులు అనేక న్యాయసూత్రాలకూ నియమాలకూ లోబడి ఉండక తప్పదు కాబట్టి వాళ్లు అన్ని సందర్భాలలోనూ దుర్మార్గుల తలలు తక్షణం నరికేసి మనల్ని సంతృప్తిపరచలేరు. ఎన్నికల కమిషన్‌కు స్థూలమైన అధికారాలే తప్ప నిర్దిష్టమైన నియమాలు (ఎక్కువగా) వర్తించవు కాబట్టి వారు చేయగలరు. మనం మన ఊరి ఎస్పైని అతగాడెంత చెడ్డవాడయినా చచ్చినా బదిలీ చేయించలేం. కోర్టులు కూడ ఎప్పుడో తప్ప చేయించవు. ఎన్నికల కమిషన్ చూడండి. ఎస్పైనికాదు డిజిపినే ఫిర్యాదు అందిన వారం రోజులలో బయటకు పంపించి అధికార పార్టీకి ఇష్టంలేని అధికారిని ఆ కుర్చీలో కూర్చో బెట్టింది. సత్తా అంటే అట్లా ఉండాలి అనుకోని వారు ఉండరు.

ప్రజాస్వామ్యం పట్ల సూత్రబద్ధమైన అభిమానం ఉన్న వారెవరికయినా 'ఇసి'కి నిజానికి ఇంత అధికారం ఉందా, ఎట్లాగుంది, ఎందుకుంది అన్న సందేహం వచ్చి ఉండాలి. ఎవ్వరికీ రాకపోవడం ఆందోళన కలిగించే విషయం. కొంతమేరకు దీనిని సానుభూతిగా అర్థం చేసుకోవచ్చు. చట్ట బద్ధ పాలన అనేది భ్రష్టు పట్టించగల వాడి చేతిలో ఆటబొమ్మ కాగలదు. అది న్యాయం చేస్తుందని- ఇప్పుడందరూ అనడం నేర్చుకున్నట్టు చట్టం తనపని తాను చేసుకుపోతుందని – ఎదురు చూసి చూసి విరక్తి చెందగలం. ప్రస్తుతానికి వర్తించే ఒక ఉదాహరణ చెప్పుకుందాం. మీరు రాష్ట్రంలో ఏ ఊరికైనా పోయి బెల్టు షాపుల గురించి అడగండి. అన్నీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయిన రెండవ రోజే మూతపడ్డాయని వింటారు. తన పని తాను చేసుకుపోయే చట్టం వాటి నన్నింటినీ కాదు, వాటిలో ఒక్క దానిని సహితం అయిదేళ్లలో మూత వేయించ లేకపోయింది. 'ఇసి' రంగంలోకి దిగిన రెండవ రోజున మాత్రం అన్నీ మూతపడ్డాయి. పైగా అదే పోలీస్ శాఖ, అదే ఎక్సైజ్ శాఖ వాటిని మూత వేయించాయి. విరక్తి చెందిన వారికిది ఆనందం కలిగించదూ?



అయితే విసుగు నుంచి విరక్తి నుంచి పుట్టే అన్ని అభిప్రాయాల లాగ ఈ ఆమోదం కూడ సందేహాస్పదమైనదే. కాదంటే ఐవి సుబ్బారావుగారికి ఈ నెలన్నర సుల్తాన్‌గిరీ ఎందుకు, పన్నెండు నెలలూ ఇచ్చేద్దామా? ఆ ప్రశ్న వేసుకోగానే మనమిప్పుడిస్తున్న ఆమోదం గురించి అనుమానం రావాలి. రానట్టయితే ఒక పోలిక చెప్పుకుందాం. ఒక మునిసిపాలిటీని నడిపే అధికారుల చర్యలకు వర్తించే వివరమైన చట్టమేదీ లేకుండ, మునిసిపాలిటిని నిర్వహించడానికి అవసరమైన సకల అధికారాలు మునిసిపల్ కౌన్సిల్ కలిగి ఉంటుంది అన్న ఒక వాక్యం రాజ్యాంగంలోనో వేరొక చట్టంలోనో రాసి మనమీద పడేసారనుకోండి. అప్పుడెట్లాగుంటుందో ఒకసారి ఆలోచించండి.

ఎన్నికల కమిషన్‌కు ఉండే అధికారం అట్లాంటిదే. ఎన్నికల ప్రక్రియ యొక్క నిర్వహణ, పర్యవేక్షణ, నియంత్రణ ఎన్నికల కమిషన్ బాధ్యతలుగా ఉంటాయి అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 నాలుగు పొడి మాటలలో అంటుంది. దాని కోసం ఎన్నికల కమిషన్ ఏం చేయొచ్చు, ఏం చేయకూడదు అని రాజ్యాంగం చెప్పదు. 'ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరగడానికి అవసరమైన అన్ని ఆదేశాలూ జారీచేసే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఆర్టికల్ 324 ఇచ్చిన అధికారం రీత్యా ఉంది' అని సుప్రీంకోర్టు 1986లో జారీచేసిన ఒక తీర్పులో అనింది. ఆ అధికారాలను క్రోడీకరించి వాటికి లిఖిత రూపం ఇచ్చే అధికారం ఆర్టికల్ 329 పార్లమెంటుకిచ్చింది గానీ పార్లమెంటు ఆ అధికారాన్ని పరిమితంగా మాత్రమే వాడుకుంది. పార్టీల చిహ్నాలు, అభ్యర్థుల నామినేషన్లు, ఎన్నికల అక్రమాల నిర్వచనం, నియోజకవర్గాల డీలిమిటేషన్, ఎన్నికను సవాలు చేసే వ్యాజ్యాలు తదితర విషయాల గురించి చట్టాలు చేసింది గానీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ ఎటువంటి ఆదేశాలు జారీచేయవచ్చో చెప్పే చట్టమేదీ పార్లమెంటు ఇప్పటిదాకా చేయలేదు. అందువల్ల రాజ్యాంగం ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన అధికారం అపరిమితంగానే ఉండిపోయింది.

చాలా ఏళ్ళు దీనిని కేంద్ర ఎన్నికల కమిషన్ పెద్దగా వాడుకోలేదు గానీ, 1990ల తొలి సంవత్సరాలలో దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉండిన టి.ఎన్.శేషన్ నియామకంతో పరిస్థితి మారింది. అప్పటినుంచి ఎన్నికల కమిషన్ రాజకీయ రౌడీలను అదుపు చేసే హీరో అయింది. దీనికి ఆద్యుడయిన శేషన్ ఎంత మాత్రం ప్రజాతంత్రవాది కాడు. రిటైరయిన తరువాత ఏ ప్రజాతంత్ర విలువనూ, నియమాన్నీ గౌరవించని శివసేన టిక్కెట్‌తో రాజ్యసభకు పోటీ చేశాడు. రిటైర్ కాక ముందే ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్‌లు లోబడి ఉండాలనీ, వారు స్వతంత్రులు కారనీ సుప్రీం కోర్టులో వ్యాజ్యం నడిపి ఓడిపోయాడు. అతని చేత ఎన్నికల కమిషన్ అధికారాలను విస్తరింప జేసింది అతని అధికార దాహమూ లేక ప్రజాస్వామ్యం మీద ప్రేమా అంటే సందేహమే. అతను 1991లో జారీచేసిన నియమావళినే 'ఎలక్షన్ కోడ్' అని పిలుస్తున్నారు.

ఎన్నికల సక్రమ నిర్వహణకు ఒక స్వతంత్ర యంత్రాంగం ఉండడం మంచిదేగానీ దాని అధికారాల క్రోడీకరణ అవసరం. ఆ క్రోడీకరణ చట్టం రూపంలో ఉండడం, కోర్టుల పర్యవేక్షణకు లోబడి ఉండడం అవసరం. లేకపోతే పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కీలక స్థానం గల ఎన్నికల నిర్వహణ ఒకరిద్దరు బ్యూరోక్రాట్ల అవగాహనకు బలి

**ఎన్నికల సక్రమ నిర్వహణకు ఒక స్వతంత్ర యంత్రాంగం ఉండడం మంచిదేగానీ దాని అధికారాల క్రోడీకరణ అవసరం. ఆ క్రోడీకరణ చట్టం రూపంలో ఉండడం, కోర్టుల పర్యవేక్షణకు లోబడి ఉండడం అవసరం. లేకపోతే పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కీలక స్థానం గల ఎన్నికల నిర్వహణ ఒకరిద్దరు బ్యూరోక్రాట్ల అవగాహనకు బలికాగలదు.**

కాగలదు. ఉదాహరణకు ఈసారి మీకెక్కడా గోడల మీద రాతలు గానీ పోస్టర్లు గానీ బ్యానర్లుగానీ కనిపించవు. ప్రైవేట్ ఇళ్ల గోడల మీద ఆ యింటి యజమాని అనుమతి లేకుండ రాయడానికి వీలు లేదన్నది శేషన్‌గారి నియమాలలో ఉంది. అంతకు ముందు ఇళ్లు గల వాళ్లు ఎంత అయిష్టంగా నయినా దానిని ప్రజా స్వామ్యం కోసం చేస్తున్న త్యాగంగా భావించే వారు, భరించేవారు. ఈసారి ప్రభుత్వ కార్యాలయాల గోడల మీద కూడ రాయడానికి వీలు లేదన్న నియమం పెట్టారు. పోస్టర్లు, బ్యానర్లు కూడ అంతే. దీనివల్ల చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువగా నష్టపోతున్నారు. అభ్యర్థి పేరు, చిహ్నం ప్రజల మనసులకు హత్తుకోవడం చాలా అవసరం. పెద్ద పార్టీలకు రిజర్వ్ చేసిన చిహ్నాలుంటాయి, మీడియా ద్వారా ప్రచారం లభిస్తుంది. చిన్నవాటికి గోడ మీద రాతలే దిక్కు.

ప్రభుత్వం ఎన్నికల ప్రకటన తరువాత కొత్త పథకాలు ప్రకటించకూడదన్న శేషన్ గారి కోడ్ పరిధి ఏమిటో స్పష్టంగా లేకపోవడం కూడ నష్టం కలిగిస్తున్నది. అప్పుడెప్పుడో మంజూరయి మొదటి విడత ఫైసలిచ్చిన 'ఇందిరమ్మ ఇళ్లకు కోడ్ పేరిట రెండవ విడత ఫైసలియ్యడం లేదు. ఇళ్లు సగం కట్టుకున్న జనం ఎన్నికలెప్పుడయిపోతాయా అని ఎదురు చూస్తున్నారు. 2006లోనే జైలునుంచి బయటికి రావలసి ఉండిన జీవితఖైదీల విడుదల పైన సుప్రీం కోర్టు విధించిన స్టే ఈ జనవరిలో తొలగిపోయినా అదేదో కొత్త నిర్ణయమయినట్టు కోడ్ పేరిట వారి విడుదల నిలిచిపోయింది. స్పష్టమయిన రూపురేఖలు లేని అధికారాలు ఇట్లాంటి అనర్థాలే తెచ్చి పెడతాయి.